క్లుప్తంగా

ముగిసిన మరిడిమాంబ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్ గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి వేకువ జాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ గల్లా చిన్నా, గ్రామ ప్రెసిడెంట్ పరదేశినాయుడు, వైస్ ప్రెసిడెంట్ రమణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థినికి అభినందన



మోనీషాకు మొమెంటో అందిస్తున్న హెచ్ఎం రాజ్యలక్ష్మి

కంచరపాలెం: విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ రాణించడం అభినందనీయమని రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి అన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇటీవల నిర్వహించిన చిత్రకళ పోటీల్లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని కె. మోనీషా జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో ఆమెను గురువారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది మోనీషాకు అభినందనలు తెలిపారు.

23 నుంచి సంగీత నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: కళాభారతి ప్రాంగణంలో ఈ నెల 23 నుంచి 28 వరకు ఆరు రోజుల పాటు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు తెలిపారు. కార్యక్రమాల పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్ రావుకు 'నాద విద్యా భారతి'బిరుదు, రూ.లక్ష నగదు, రూ.2.5 లక్షల విలువైన స్వర్ణకమలం బహూకరించి సత్కరిస్తారు. అనంతరం ద్వారం సత్యనారాయణచే వాయులీన కచేరీ ఉంటుంది. 24న హిందుస్థానీ, కర్ణాటక గాత్ర సంగీతంలో పూర్తిక కృష్ణన్ (ముంబయి), నివేదిత భట్టాచార్య (కోల్‌కతా)ల జుగల్బందీ , 25న ప్రముఖ కర్ణాటక గాత్ర విద్వాంసులు విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర యుగళం ప్రదర్శన ఏర్పాటు చేశారు. అకాడమీ కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, గ్రంధి మల్లికా మనోజ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ బులందసహార్ జిల్లాకు చెందిన అజయ్ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.30 వేల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మనవడికి వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని మనవడికి అప్పగిస్తున్న మమత

అల్లిపురం: సీపీ చేపట్టిన జ్యోతిర్గమయ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. నగరంలో యాచకులుగా తిరుగుతున్న వారిని రెస్క్యూ చేయటంతో వారి మూలాలు బయటపడుతున్నాయి. వన్‌టౌన్ ప్రాంతంలో జామి లక్ష్మి అనే వృద్ధురాలు పాదానికి ఇన్‌ఫెక్షన్ అయ్యి వర్షంలో తడుస్తుండగా సీపీ శంఖబ్రత బాగ్చి గుర్తించారు. ఆమెను వన్‌టౌన్ పోలీసుల సాయంతో మాతృప్రేమ వృద్ధాశ్రమానికి పంపించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మమత ఆమెకు ఆశ్రయమిచ్చారు. వివరాలు ఆరా తీసి, విజయనగరం జిల్లా నరవలో ఉంటున్న ఆమె మనవడు రాయి మోహన్‌ను ఆశ్రమానికి పిలిపించి, కంచరపాలెం పోలీసుల సమక్షంలో గురువారం అప్పగించారు.

క్లాప్ వాహనాల్లో కాంట్రాక్టర్ గోల్‌మాల్

- ఒక్కో వాహనానికి ఇద్దరు లోడర్లు ఉండాలని ఒప్పందం
- ఒక్క లోడర్‌నే పంపిస్తున్న వైనం
- జీవీఎంసీ సిబ్బందితో రెండో లోడర్ పనులు
- లోపాయికారి ఒప్పందాలే కారణమంటున్న కార్మికులు
- సరిపడా కార్మికులు లేక గల్లీల్లో చెత్త సేకరణలో ఇబ్బందులు

క్లాప్ వాహనాల్లో కాంట్రాక్టర్ గోల్‌మాల్ చేస్తున్నారు. లోడర్ పనిని జీవీఎంసీ కార్మికుల చేత చేయిస్తూ లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారు. ఈ నిర్వాకంలో అధికారుల భాగస్వామ్యమూ ఉందని, వారితో లోపాయికారి ఒప్పందాలే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



డంపింగ్ యార్డులో పార్క్ చేసిన క్లాప్ వాహనాలు



క్లాప్ వాహనంలో చెత్త లోడ్ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

గోపాలపట్నం: చెత్త సేకరణలోనూ చేతివాటం చూపిస్తూ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నారు కొందరు కాంట్రాక్టర్లు. అధికారులూ వారితో చేయి కలపడంతో ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతోంది. మరోవైపు సరిపడా కార్మికులు లేక నగరంలో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది.

నగరంలో ఇంటింటా చెత్తను సేకరించేందుకు ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాల్లో డ్రైవర్, ఇద్దరు లోడర్లను ఏర్పాటు చేసుకునేలా కాంట్రాక్ట్ పద్ధతిలో ఒప్పందం జరిగింది. అయితే, కాంట్రాక్టర్ ఒక లోడర్‌ను మాత్రమే వాహనంతో పంపిస్తూ, మరో లోడర్ పనిని ఆ ప్రాంతంలో ఉండే జీవీఎంసీ సిబ్బంది చేత చేయించుకుంటున్నారు. దీంతో గల్లీల్లో పనికి ఇబ్బంది ఏర్పడుతోందని, కాల్వలు తీయకుండా వదిలేస్తున్నారని, రోడ్లు తుడవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోపాయికార ఒప్పందాలతో..

కాంట్రాక్టర్‌తో జీవీఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ స్థాయి అధికారుల లోపాయికార ఒప్పందాలే ఇందుకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వాహనాల అబ్సెంట్లు, హాజరు, తిరిగే విధానాలు మొత్తం చేసేది వీరేనని.. వీరి కనుసన్నల్లో ఇలాంటి ఒప్పందాలు జరుగుతాయని చెబుతున్నారు. బిల్లులు మంజూరు చేయడం వంటివి జోనల్ స్థాయిలో, ఉన్నతాధికారుల స్థాయిలో మంజూరు చేయాల్సి ఉండడంచేత ఈ లోపాలన్నీ సర్దుకుపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై జోన్–8 అధికారులు మాత్రం తప్పించుకునే ధోరణిలో మాట దాటేస్తున్నారు. వీటి విషయం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులే చూస్తున్నారంటూ నెపం వారిపై నెట్టేస్తున్నారు.

ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి?

జీవీఎంసీ సిబ్బంది సెలవు పెడితే జీతం కట్ చేసే అధికారులు.. క్లాప్ వాహన సిబ్బంది సెలవు పెట్టినా, సమ్మె చేసినా వారి జీతాలు కట్ చేయడం లేదని, కాంట్రాక్టర్‌కు మొత్తం సొమ్ము చెల్లించేస్తున్నారని పలువురు కార్మిక సంఘం సభ్యులు చెబుతున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.66 వేలు చెల్లిస్తున్నారని చెబుతున్నారు. జీవీఎంసీ జోన్–8 పరిధిలో క్లాప్ వాహనాలు 73 ఉన్నాయి. మొత్తంగా ఒక వాహనానికి ఇద్దరు ఉండాల్సింది ఒకరే ఉండడంతో 73 మంది పనివారి జీతం మిగిలినట్లే అవుతుందని యూనియన్ నాయకులు, తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ సొమ్ము ఏమవుతోంది? ఎవరి జేబులు నింపుతోందని ప్రశ్నిస్తున్నారు. ఒక్కరికి కనీసం రూ.12వేలు జీతం కాగా మొత్తం జీతాలు రూ.8లక్షలు అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని, క్లాప్ లోడర్ల పనిని జీవీఎంసీ పని వారి చేత కాకుండా కాంట్రాక్టర్ పని వారి చేత చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

> **పని సౌలభ్యం కోసం చేయమంటున్నాం**
>
> వార్డుల్లో పని సౌలభ్యం కోసం జీవీఎంసీ పని వారి చేత చేయిస్తున్నాం. క్లాప్ వాహనాలకు జీవీఎంసీ ఎంత చెల్లిస్తుందో వాటి వివరాలు తెలియదు. ఆ వాహనాలతో డ్రైవర్, ఒక లోడర్ మాత్రమే వస్తున్నారు. మరో వ్యక్తిని మేము కేటాయిస్తున్నాం.
>
> –బండారు అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో, జోన్–8

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

అభివృద్ధి పనుల పరిశీలన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు గురువారం పరిశీలించారు. త్రినాథపురం కొండదేవతమ్మ గుడివద్ద జరుగుతున్న రిటైనింగ్ వాల్స్, దుర్గానగర్ కొండ మీద పార్కు, రిటైనింగ్ వాల్స్ పనులను పరిశీలించారు. జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు టీడీపీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానంతో దేశం అభివృద్ధి

దీక్ష ప్రారంభించిన సంఘమిత్ర సూరిబాబు



దీక్ష చేస్తున్న సూరిబాబు

బీచ్‌రోడ్డు: దేశంలోని జీవనదులను అనుసంధానం చేస్తే అద్భుతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా అమెరికాను కూడా అధిగమించవచ్చని సంఘమిత్ర సూరిబాబు అన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మూడు రోజుల దీక్షను ఆయన ప్రారంభించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి సూరిబాబుకు పూలమాల వేసి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నాగావళి, సువర్ణముఖి, వేగవతి, గోస్తాని వంటి నదులను అనుసంధానం చేయడం వల్ల ఉత్తరాంధ్ర రైతులు కరువు అనే మాటను పూర్తిగా మర్చిపోతారన్నారు. నీటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండవని, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఒక కొత్త దశ మొదలవుతుందని చెప్పారు. భారతదేశంలో సహజ వనరులు ఉన్నప్పటికీ, నదుల అనుసంధానం కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సూరప్పుడు, తులసి, ఆశ, దుర్గ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

'లులూ భూ కేటాయింపులు ఉపసంహరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాణీశర్మ

అల్లిపురం: ఆర్కే బీచ్‌లో లులూ మాల్‌కు కేటాయించిన సుమారు 14 ఎకరాల భూమిని వెంటనే ఉపసంహరించుకుని, ఆ స్థలంలో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త రాణీశర్మ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జగదాంబ సిటు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని 'లులూ వద్దు–సైన్స్ సిటీ ముద్దు'అనే నినాదంతో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. 99 ఏళ్లకు విలువైన భూముల్ని నామమాత్రపు రుసుముతో లీజుకు ప్రభుత్వం ఇవ్వడం ఆక్షేపణీయమన్నారు. మూడేళ్ల ఎలాంటి లీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని జీవో నెం.137లో పేర్కొన్నడం దారుణమన్నారు. లులూకు కేటాయించిన భూమిలో ఆ సంస్థ కొంత భూమిని మరి కొన్ని సంస్థలకు కేటాయించుకోవచ్చని పేర్కొనడం అతి పెద్ద అవినీతి చర్యగా ఆరోపించారు. సెప్టెంబర్ 1న లులూ మాల్ భూ కేటాయింపులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని, ఆ తర్వాత ప్రజా బ్యాలెట్ నగరంలో విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. ప్రజా వనరుల పరిరక్షణకు చేస్తున్న ఈ ఉద్యమంలో విశాఖ ప్రజలు పాల్గొని, లులూ మాల్ ఒప్పందం రద్దు చేసి, సైన్స్ సిటీ నిర్మించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వద్దామని పిలుపునిచ్చారు. ఈ వేదికకు బి.గంగారావు, క్షేత్రపాల్, వెంకటలక్ష్మిలు కన్వీనర్లుగా నియమితులయ్యారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం



ఉత్తమ ఫలితాలు సాధించిన టీటీఐలను సత్కరిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా సత్కరించారు. మే నెలలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మే నెలలో సాధించిన రూ.2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ. 4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె. శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వీరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ సమక్షంలో సత్కరించారు.

భూగర్భ విద్యుత్ పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద కప్పిన భూగర్భ విద్యుత్ కేబుల్ గోతులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో భూగర్భ విద్యుత్ పనులు తిరిగి ప్రారంభించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గోతులను పూడ్చారు. స్టేషన్ వద్ద భూగర్భ విద్యుత్ పనుల కోసం గోతులు తవ్వి వదిలేయడంతో వాహనచోదకులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ఈ నెల 20న 'నత్తనడకన భూగర్భ విద్యుత్ పనులు' ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా గోతులను పాక్షికంగా పూడ్చారు. గురువారం నుంచి ఈ పనులు పునః ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణానికి, విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం గోతులు తవ్వామని, అయితే, ఇంకా కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టవలసి ఉన్నందున ప్రయాణికులకు, పార్కింగ్ చేసే వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా పూడ్చామని సిబ్బంది తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యలో నిలిచిన కాలువ పనులు

- భారీ వర్షం వస్తే తప్పని అవస్థలు
- గెడ్డ పనులు పూర్తి చేయాలని స్థానికుల విన్నపాలు



మధ్యలో నిలిచిన కాలువ పనులు ఇవే..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు వద్ద నిర్మించిన కాలువ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టర్‌కు కొంతవరకే కాంట్రాక్ట్ పనులు అప్పగించటంతో ఈ సమస్య ఎదురైంది. దీంతో భారీ వర్షం వస్తే ఎప్పటిలానే నీరు నిలిచిపోతోంది.

ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గల తహసీల్దార్ కార్యాలయం రక్షణ గోడపై ప్రాంతం నుంచి ఇటీవల మూడు అడుగుల వెడల్పు, రెండు అడుగుల లోతుతో పెద్ద కాలువ పనులు చేపట్టారు. భారీ వర్షాలు వస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు, బురద నీరు ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, హౌసింగ్‌కాలనీ వద్ద నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎగువ ప్రాంతం నుంచి పెద్ద కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇది పూర్తి స్థాయిలో జరగలేదు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణ ప్రదేశానికి వచ్చేసరికి సదరు కాంట్రాక్టర్ చేపట్టే పనులు పూర్తయ్యాయి. మిగిలిన భాగం తనకు అప్పగించలేదని కాంట్రాక్టర్ నిష్క్రమించాడు. దీంతో పనులు ఎటూ కాకుండా మధ్యలో నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పూర్వం మాదిరిగానే కార్యాలయం ఎదుట, హౌసింగ్‌కాలనీ వద్ద నీరు నిలిచిపోయింది. ఇంతవరకు చేపట్టిన పనులు వృథాగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, పనులు పూర్తిస్థాయిలో జరిపించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఆందోళన



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

పరవాడ: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని సిటుజిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిటు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దుచేసి నాణ్యమైన 5జి ఫోన్లు మంజూరు చేసి, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.రమణి మాట్లాడుతూ నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచి, యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చు చేయాలన్నారు. గ్రాట్యుటీ జీవోలో మార్పులు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనకు దిగుతామని యూనియన్ గౌరవ అధ్యక్షురాలు సీహెచ్ దేవి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమస్యలపై తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రమేష్‌నాయుడులకు వినతి పత్రాలు అందించారు. ఆందోళనలో నీలిమ, అమ్మాజీ, భవానీ, అరుణ, దేవి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.


కలుషిత మేహాద్రి



పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి మేహాద్రి రిజర్వాయర్‌కు చేరుతున్న మురుగు నీరు

> 'మేహాద్రి రిజర్వాయర్ కట్టి దాదాపు 40 ఏళ్లు కావస్తుంది బాబూ.. పదేళ్ల క్రితం వరకు పశువుల్ని మేతకు తోలుకెళ్లి రిజర్వాయర్‌లో నీటిని నేరుగా తాగేవాళ్లం. ఏ ఇబ్బందీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు రిజర్వాయర్ నీటిని చూస్తే భయమేస్తోంది. పశువుల కాళ్లు, ఫారం కోళ్ల వేస్ట్, మురుగు నీటి కంపు ఎక్కువగా ఉంది. తాగడానికి కాదుకదా తాకడానికి కూడా భయంగా ఉంది. ఇలాగే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో జనం విషపు నీటినే తాగాలి'
>
> – మేహాద్రి రిజర్వాయర్ నిర్వాసిత రైతు ఆవేదన

- రిజర్వాయర్‌లో కలుస్తున్న విషపూరిత వ్యర్థాలు
- పశువులు, కోళ్ల కళేబరాలు, గ్యాలన్ల కొద్దీ మురుగు నీరు చేరిక
- నగర ప్రజల దాహార్తి తీర్చే మేహాద్రిపై అధికారుల నిర్లక్ష్యం



మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

పెందుర్తి: ఒకప్పుడు స్వచ్ఛమైన నీటికి మారుపేరుగా ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రమాదకర రీతిలో కలుషితమవుతోంది. నగరంలో మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ఈ రిజర్వాయర్.. ప్రస్తుతం మురుగు నీటికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. సాధారణ చెత్తతో పాటు అత్యంత ప్రమాదకరమైన పశువులు, మేకలు, కోళ్లు, కుక్కలతో పాటు ఇతర జంతువుల కళేబరాలు రిజర్వాయర్‌లోనే కలుస్తున్నాయి. మేహాద్రి పరీవాహక ప్రాంతంలోని ప్రజల వాడుక నీరంతా రిజర్వాయర్‌లోకే చేరుతోంది. ఈ క్రమంలో లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీర్చే మేహాద్రి కలుషిత కాసారంగా మారుతోంది.

నాలుగు దశాబ్దాల చరిత్ర

నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాదాపు 40 ఏళ్ల క్రితం మేహాద్రి రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. పెందుర్తి మండలం జెర్రిపోతుపాలెం, నరవ, చింతగట్ల, పెదగాడి, చింతలగ్రహారం, రాంపురం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలను రైతులు వదులుకున్నారు. మేహాద్రి ఏర్పడ్డాక నగరంలోని మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు పలు కంపెనీల అవసరాలను కూడా తీరుస్తోంది. నగరంలో నివాసాలు పెరుగుతున్న క్రమంలో మేహాద్రికి ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న తాటిపూడి, రైవాడల సరసన మేహాద్రి కూడా చేరింది.

కొరవడిన పర్యవేక్షణ

మేహాద్రి రిజర్వాయర్‌పై పర్యవేక్షణ దాదాపు కొరవడింది. మైదాన ప్రాంతాల్లోని వర్షపు నీటిని పది చిన్నాపెద్దా కాలువలు మేహాద్రికి చేరుస్తాయి. ఇటు పెందుర్తి రైల్వే వంతెన సమీపం నుంచి చింతలగ్రహారం ప్రధాన కాలువ ద్వారా.. అటు సబ్బవరం బొబ్రమ్మగెడ్డ ద్వారా అధికశాతం నీరు మేహాద్రికి వస్తుంది. ఆయా కాలువలే ప్రస్తుతం నీటి కలుషితానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల నుంచి పశువులు, కోళ్ల వ్యర్థాలతో పాటు, నివాసాల నుంచి వస్తున్న మురుగు నీరు ఈ కాలువల్లోకే చేరుతోంది. దీంతోపాటు చింతలగ్రహారం సమీపంలోని రిజర్వాయర్ ప్రధాన కాలువలో నిత్యం టన్నుల కొద్దీ చెత్త వేస్తున్నారు. ఆ చెత్తాచెదారం, విషపూరిత వ్యర్థాలు మురుగు నీటితో కలిసి రిజర్వాయర్ గర్భానికి చేరుకుంటున్నాయి. దీంతో రిజర్వాయర్ పూడికతో పేరుకుపోయింది. నీటి పారుదల శాఖ, జీవీఎంసీ సమన్వయలోపంతో పర్యవేక్షణ గాలికి వదిలేశారన్న ఆక్షేపణలు న్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మేహాద్రి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాలుష్యానికి కారణాలివే..

- మేహాద్రి పరీవాహక ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలతో వాటి నుంచి వ్యర్థాలు/మురుగు నేరుగా రిజర్వాయర్‌కు చేరుతోంది.
- దాదాపు 15 ఏళ్ల నుంచి రిజర్వాయర్‌లో పూడిక తీయలేదు.
- ప్రస్తుతం మేహాద్రి ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువలు, మేహాద్రి గర్భం కూడా గుర్రపు డెక్క, ఇతర పిచ్చితుప్పలతో నిండి ఉంది.
- మురుగును, వ్యర్థాలను మేహాద్రికి చేరకుండా నియంత్రించాల్సిన జీవీఎంసీ విఫలం కాగా, మేహాద్రిని పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన నీటి పారుదలశాఖ కూడా నిర్వహణను గాలికి వదిలేసింది.

మేహాద్రి విస్తీర్ణం: 15 వేల ఎకరాలు

జీవీఎంసీకి నీటి సరఫరా: 8 నుంచి 10 ఎంజీడీలు

(మిందివద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రం నుంచి గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, భెల్ ప్రాంతాలకు జీవీఎంసీ సరఫరా చేస్తుంది.)

> **జాగ్రత్తలు తీసుకుంటున్నాం**
>
> 
>
> మేహాద్రిలో వ్యర్థాలు, మురుగు నీటి చేరికపై ఫిర్యాదులు వస్తున్నాయి. తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మేహాద్రికి సబంధించి సుందరీకరణ పనులు చేపట్టాం. పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యత మాది కాదు. మేహాద్రి అభివృద్ధి, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత శాఖ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. సమష్టిగా పనిచేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం.
>
> – కె.హేమావతి, జోనల్ కమిషనర్, జోన్–8